# కట్టుతప్పిన పిల్ల

(శరచ్చంద్రుని 'అరక్షణీయ' అనే చిన్న నవలకు వేలూరి శివరామశాస్త్రి అనుసరణం)

'ఏమమ్మో అత్తా! మా అమ్మ ప్రసాదం పంపింది, ఇదుగో తీసుకో.'

'ఎవరదీ గౌరీనాథమా? రా నాయనా రా!' అంటూ దుర్గమ్మ వంటింట్లోంచి వెలుపలికి వచ్చి 'నీకడుపు చల్లగా ఉండాలి, ఓసీ జ్ఞానప్రసూనా! గౌరీనాథం బావ వచ్చాడే, చాప వేసి ప్రసాదం పుచ్చుకో. రాత్రి తొమ్మిదిగంటలవేళ ఆ వీథిలో గుర్రబ్బండీ చప్పుడైంది. ఎవరో వచ్చారనుకున్నా. వదినెగారే వచ్చారని తెలిస్తే వెంటనే వచ్చి చూచిపోయేదాన్ని. ఇటువంటి మనిషి మళ్ళా యీ జగత్తులో కనబడుతుందా? వదినె బాగా వుందా నాయనా! ఈ రావడం రామేశ్వరంనుంచనుకొంటాను. ఏమి చేస్తున్నావే అమ్మా మీ బావ నిలబడేఉంటే అని అన్నది.

తల్లి పిలుపు వినిచాప చేత్తో పుచ్చుకొని ఒక పిల్ల గదిలోపలనుంచి బయటికి వచ్చింది. ఆ పిల్ల నలుపు; పన్నెండు పదమూడేండ్లుఉంటై.

తల యెంతవరకు వంచడానికి వీలవుతుందో అంతవరకూ వంచి అరుగుమీద చాప పరిచి ఆ పిల్ల గౌరీనాథానికి దాపుగా నిలబడ్డది. ఒకమాట అయినా మాటాడలేదు, తల కొంచెంఎత్తి అయినా చూడలేదు. గౌరీనాథం చేతిలోంచి ప్రసాదపు గిన్నె కాస్తా తీసుకుని మెలమెల్లగా వెళ్లి పోయింది. కాని ఆ కన్య వెళ్లేటప్పుడు కొంచెం పరకాయించి చూస్తే, అణచిపెట్టుకున్న ఒకానొక సంతోషం కన్నులలోంచీ ముఖంలోంచీ పైకుబుకుతూ ఉన్నట్లు కనిపెట్టవచ్చు.

ఆ కన్యమాట అలా వుండంగా ఇటు ఈ చక్కని పిల్లవాణ్ణి ఆచి చూస్తే, కనబడని ఒకానొక విద్యుత్ ప్రవాహం అతని మొహమ్మీద ఇంత కాంతి పారబోసి ఒక చిటికలో మాయమై పోవడంకూడా కనిపెట్టవచ్చు.

గౌరీనాథం చాపమీద కూచుని తీర్థయాత్రను గురించి చెప్పడం మొదలుపెట్టాడు. అతనితండ్రి సబ్‌జడ్జీ పనిచేసి చాలా భూములూ ధనమూ సంపాదించి పింఛన్ పుచ్చుకున్నాడు. ఇతడు ఇహలోకం వదిలి నాలుగేండ్లయింది. గౌరీనాథం బి.యే. పరీక్ష

యిచ్చాడు. తల్లిని తీర్థయాత్రలకు రెన్నెల్ల క్రితం బయలుదేరదీసి శ్రీరంగమూ రామేశ్వరమూ వగైరా వెళ్లి గత రాత్రే యింటికి వచ్చాడు.

దుర్గమ్మ యీమాటలువిని నిట్టూర్చి 'నేను పాపాలకల్లా భైరవుణ్ణి నాయనా! ఇంకేం చేయకపోయినా మానె. ఓసారి కాశీ వెళ్ళి విశ్వేశ్వరదర్శనం చేసుకోరావాలని అనుకున్నాను. కాని ఈజన్మలో ఈ కోరిక యిహ తీరదు' అని అంది.

'కాశీ అనండి మరేమయినా అనండి, ఈ బాదరబందీ అంతా తెగతెంపు చేసుకుని బైలుదేరాలి, లేకపోతే మరిపోవడం పడదు. నేనిల్లాగే ఆవేశం తెచ్చుకుని బయలుదేర దీయకపోతే మా అమ్మయినా తీర్థయాత్ర చేసుకొస్తుందనుకొన్నావా?' అని గౌరీనాథం అన్నాడు.

దుర్గమ్మ మరోసారి పొడుగ్గా ఊపిరి వదిలి – 'నాయనా! నీకు తెలియని దేముంది? నే నెల్లా తెగతెంపు చేసుకోగలను. మీ మామకు ముప్ఫై రూపాయలు జీతం. ఈ ముప్ఫైలోనే కూడుగుడ్డలూ మందుమాకులూ ఒకటేమిటి సర్వమూ సర్దుకోవాలి. చూస్తూండగా చూస్తూండగా ఈపిల్ల గూడా పదమూడో సంవత్సరంలో కాలుబెట్టింది. నీకు నిజం చెబుతా బాబూ, దీన్ని చూస్తే నా గుండెల్లో నెత్తురిగిరిపోతుంది. ఔరా, తల్లి యింత గర్భశత్రువును గూడా గర్భధారణ చేసి లాలనాపాలనా చేయాలిసి ఉంటుంది కాబోలు –' అని యిల్లా చెప్పుకుంటూ పోతూవుండగా ఆమె కళ్లు రెండూ తడుసుకుంటూ వచ్చె.

కాని ఒక తమాషా–అదేమిటంటే : దుర్గమ్మ యింత దుఃఖం వెళ్ళబోసుకున్నా యిన్ని పిరికి మాటలన్నా గౌరీనాథం నవ్వేశాడు. అటు తరువాత – అత్తదంతా గందరగోళం. 'ఏ మమ్మా అత్తా! నీ కొక్కత్తేకేనా ఆడపిల్ల? ఈలోకంలో ఉన్న అందరి చింతా నీ ఒక్కత్తెకె ఉన్నట్లుంది' అని అన్నాడు.

'నా కిది చింతామాత్రమే కాదు నాయనా మరి మరణవేదన. మన కులంవారిని నే నెరుగుదును కద. పిల్లకు పెళ్ళి చేయలేకపోయినంతమాత్రానికే కులం గోతిలోపడుతుంది. సరే, అలాగని ఎట్లా. నేను పెండ్లిచేయగలను? డబ్బు కుమ్మరించాలి. ఎక్కణ్ణుంచి తేను? ఈ భద్రాసనంలో అనగా ఈ యింట్లో మూడోపాలు తప్ప మరి మాకేమీ లేదు నాయనా!' అని దుర్గమ్మ అంది.

ఒక అరగంట వెనుక ఈ కన్యను గురించి ఆలుమగలకు యుద్ధమయి పోయింది. మగడు విస్తట్లో అన్నం చిమ్మేసి అర్థాకలితో ఆఫీసుకు లేచి పోయాడు. ఆ వ్యథ దుర్గమ్మ నిప్పుడు కలచి వేసింది. దుర్గమ్మ కన్నుల్లోంచి నీరు పైకుబికి చెక్కులు జారి ఒడిలో పడ్డది. ఆమె ఆ కన్నీరు తుడుచుకుంటూ – 'వెనుకటి జన్మలో ఎన్ని స్త్రీ హత్య లెన్ని

బ్రహ్మహత్యలు చేశానో కాని నాయనా ఈ జన్మలో ఈపిల్లదాన్ని పొట్టను వేసుకున్నాను' అని అన్నది.

'ఏడ్చి ఏమిటమ్మా! నేను పోతున్నాను. లేకపోతే నీవు మానెయ్యవ్.

దుర్గమ్మ మరోమారు కళ్లు తుడుచుకుని - 'వెళ్లకు బాబూ కొంచెం కూచో! రెండు నిమిషాలు నీ ముందు ఏడ్చేస్తే గుండెల్లో బరువు తగ్గుతుంది - 'ఓ దేముడా! ఈ దిక్కుమాలిన దాన్ని నాకడుపులోనే పడేయాలిసి వస్తే కొంచెం పచ్చగా చేసి యెందుకు పడెయ్యలేదు? నల్లనిదని దీన్నెవరూ చేసుకోరు. అందరికీ అందమయిన పిల్లేకావాలి. ఓ పాడులోకమా! నీవు కులశీలాలనూ చరిత్రస్వభావాలను కొంచెమైనా చూడకుండా పిల్ల కొంచెం నల్లనిదని లోటు పెట్టావ్. మరిపిల్లకు పెళ్ళి కాకపోతే దాని తల్లిదండ్రులను ఎందుకు శిక్షిస్తావ్?' అని మొరపెట్టుకుంటాను' అని అన్నది.

'అయితే నల్లపిల్లల కెక్కడా పెండ్లవడం లేదూ? తుమ్మెదలు నలుపే, కోయిలలూ నలుపే అవంటే యెవరికీ ఆదరం లేదూ? ఇవన్నీ పాతకాలపు మాటలే అత్తా' అని గౌరీనాథం అన్నాడు.

'మాటే మిగిలింది కాని చేతమాత్రం ఎక్కడా లేదు నాయనా! ఆ మాటవల్ల నాకు ఓదార్పూ కలుగలేదు, ధైర్యమూ కలుగలేదు. గిరీశంగారమ్మాయి పెండ్లి కండ్లముందు జరగటం చూస్తే కాళ్లూ చేతులూ కడుపులోకి కూరుకోపోయెయ్. సరిగ్గా వారిదిన్నీ మా చందమే. ధనబలమూ లేదు, రూపబలమూ లేదు. కాబట్టి అరవైయేళ్ల వరుడు. ఆ పిల్ల యేడుపెప్పటికీ నాచెవిలో గింగురుమంటూంది' అని దుర్గమ్మ అన్నది.

గౌరీనాథం వింతపడి - 'అరవైయే? అయ్యబాబో మళ్లా చెప్పు' అనిప్రశ్నించాడు.

ఔనుబాబూ ఔను. వరుడు హరిశాస్తుల్లు, అతని కొడుకు - అల్లుడు నిత్యానందం, అతని కూతురికి. ఏడెనిమిదేళ్లు? ఇహ లెక్కేసుకో వరుడు హరిశాస్తుల్లు కెన్నేళ్లుంటాయో.'

ఈసంగతి విని మరినోట మాటరాక గౌరీనాథం స్తబ్దుగా చూస్తూ కూచున్నాడు.

దుర్గమ్మ ఇలా చెప్పుకుంటూ పోయింది: ఆపిల్ల ఏవంచే విషం మింగితే కాని ఉరిపెట్టుకుంటే కాని కులానికి మసిపూసి లేచిపోతేకాని నేను తల్లినై దాన్ని ఏలాగు నిందింపగలనో కొచెం చెప్పు నాయనా!'

గౌరీనాథంమాటాడక కూచున్నాడు. దుర్గమ్మ గభాలున అతనిచేతులు పట్టుకుని- 'నాయనా గౌరీనాథం! ఈ కాలం మీపిల్లలలో దయాధర్మాలుంటాయని అందరూ చెప్పుకుంటూవుంటారు. మీ యిస్కూళ్లలోనూ కాలేజీలలోనూ ఏ కుర్రాడయినా దయతలచి

దీనికి తన పాదాల దగ్గర కొంచెం ఆశ్రయం ఇస్తాడేమో, భోగట్టాచేసి పెడుదూ, నీకు పుణ్యముంటుంది. నేను నీకు మరణ పర్యంతం బానిసనై యుంటాను' అని అన్నది.

గౌరీనాథం కుందేల్లాగా బెదరిచేతులు విడిపించుకుని దణ్ణం పెట్టి - 'అత్తా! యెందుకమ్మా యింత తొందరపడతావ్? నేను మాట యిస్తున్నా' అని ఆగిపోయాడు.

కాని ఆ మాటయేమిటో ఈయలేకపోయాడుకాని సిగ్గువల్ల అతని చెవివరకూ ఎరుపెక్కింది. మాట పెకలలేదు. దుర్గమ్మ యీసంగతి కనిపెట్టలేదుకాని ఇంకోరెవరయినా అక్కడ వుంటే గౌరీనాథం తొందరపడి 'పెండ్లి చేసుకుంటాన'ని మాట ఈయబోయి అంతటితో ఆగిపోయాడని ఊహించివుంటారు.

గౌరీనాథం ఆపళంగా సర్దుకుని లేచి నిలబడి సహజంగా ఇలా అన్నాడు - 'మంచిది. నా శక్తికొద్దీప్రయత్నం చేస్తాను. జ్ఞానప్రసూన ఎక్కడ? వక్కలూ ఆకులూ కాసిని ఇలా ఇయ్, ఇంటికి పోతాను. దుర్గమ్మ కొంచెం కోపంతో స్వరం ఎక్కించి- 'బావకు ఆకూ వక్కా కొంచెం ఇయ్, దిక్కుమాలిందానికి అందమూలేదు తెలివి లేదు, ఇటువంటి సంగతులన్నీ ఒకరు చెప్పాలా? ప్రసాదం తీసుకుని గదిలో దూరావ్. మరి బయటికిరావ్. ఏడిసినట్లే వుంది, వెంటనే ఆకులు తీసుకరా' అని కసరుకుంది.

'మంచిది నేనే స్వయంగా వెళ్లి ఆకులు తీసుకుంటాను. ప్రసూన ఏ గదిలో?" అని బిగ్గరగా అంటూ గౌరీనాథం పడకగదిలోకి వెళ్ళాడు.

ఎదుట తమలపుతట్ట పెట్టుకుని ప్రసూన కదలక మెదలక కూచుంది. గౌరీనాథం గదిలో కాలుపెడుతోనే గంభీరుడౌ - 'అత్త ప్రసూనకు అందమూలేదు తెలివీలేదు' అని అంటూంది. నిన్ను ఒక అరవైయేళ్ళ తాతకు కట్టపెట్టాల్సిందే అని అన్నాడు.

ప్రసూన మాటాడలేదు. తలవంచుకుని రెండాకులాకాశాని కెత్తిపట్టుకుంది.

గౌరీనాథం వెనుకగా వచ్చి ఆకు లందుకుని - 'చిలకలు బాగాచుట్టడం నేర్చుకుంటే కొంచెం క్షమించవచ్చు. అరవైయేళ్ళు తగ్గించి యే ఇరవైయో పంధొమ్మిదికో నిలపవచ్చు' అని అన్నాడు.

ప్రసూన సిగ్గుతో తల వంచి తమలపుతట్టతో కలిసిపోయింది. గౌరీనాథం స్వరం తగ్గించి 'ఇంకా కొంచెంసేపు గనుక ఉంటే అత్తదగ్గర అంతా చెప్పేశేవాణ్ణే. మంచిది. పొద్దోయింది. ఇహ వెళతాను' అని అన్నాడు.

ప్రసూన ఈ మాటకన్నాడాజవాబు చెప్పలేదు. గుమ్మడిమూటగా తల వంచుకూర్చున్నది. కూచున్న పాళంగానే ఉండిపోయింది.

'మాటా మంతి యేమీలేదూ? మంచిది' అని గౌరీనాథం అటూ ఇటూ చెదిరి తడిగావున్న ప్రసూన వేనలి కొచెంలాగి – 'వస్తాళ్లే హరిశాస్తుల్లాంటి ముసలాడు' అని నవ్వుతూ నవ్వుతూ గదిలోంచి బయటికి వచ్చాడు. అతడు చావడిలో అడుగుపెడుతూనే- 'అత్తా! ప్రసూనకోసం మా అమ్మ గాజుల జత కొనుక్కోవచ్చింది; ఇదిగో ఇలావచ్చి చూడూ' అని అన్నాడు.

'ఏది నాయనా!' అంటూ దుర్గమ్మ వంటింటి నుంచి మళ్లీ ఓసారి వెలువపలికి వచ్చింది. గౌరీనాథం జేబులోంచి తీసి గాజులు జోడించి పట్టుకున్నాడు.

వాటిరంగూ పనితనమూ కనిపించగానే దుర్గమ్మ చిత్తంపులకించింది. అంత ఆమె ఆ గాజుల జతయిచ్చి నామెను కొనియాడడం మొదలేసింది. అవి బంగారపుగాజులు కాకున్నా వెలకు చేతకూ ఎక్కువైనవే. అట్టివస్తువులా కుగ్రామపుమాట ఇటుండగా చెన్నాపట్నం బొంబాయిలాంటి బస్తీల్లోకే ఇంకా దిగలేదు. వాని పనితనమూ నైగనీగ్యమూ చూచి గౌరీనాథమే కొని అమ్మపేరు మాటుపెట్టి పట్టుకొచ్చి యిచ్చాడు.

తల్లి పదిమారులు పిలవంగా ప్రసూన బయటికి వచ్చి చడీ చప్పుడూ కాకుండా తలవంచుకొని నిలిచి యీ మొదటి నెయ్యపుకానుకను పుచ్చుకొనబోయింది. చేతులు వణికై. ఏలాగో ఓలాగు పుచ్చుకుని గౌరీనాథానికి నమస్కారంచేసి మెలమెల్లగా గదిలోకి వెళ్లిపోయింది. ఆ కన్య ఒక మాటఅయినా మాటాడలేదు కాని ఆమె లోపలి మాట అంతర్యామి తెలుసుకున్నాడు.

వెనుకనున్న యీయిరువురు మనుష్యులూ ఆ కన్యయొక్క మేని కూర్పునూ నడకతీరునూ క్షణకాలం ప్రీతితోకూడిన ముగ్ధనేత్రాలతో చూస్తూ నిలబడిపోయారు.

• ఆనందవాణి – సెప్టెంబర్ – *1946* •